క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

పోరుమామిళ్ల: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జాబ్‌మేళాకు గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, యంగ్ ఇండియా కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సున్న స్త్రీ, పురుష నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని, 10 వ తరగతి నుంచి డిగ్రీ స్థాయి చదువుకున్న నిరుద్యోగులు పాల్గొనవచ్చన్నారు. కడప, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పని చేయాల్సి ఉంటుందని, ఉద్యోగాన్ని బట్టి రూ. 10 వేల నుంచి రూ. 13,500 వేతనం, వసతి, ఇతర సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు.

కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు పంపిణీ



కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు అందజేసిన మున్సిపల్ అధికారులు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, అప్కాస్ కార్మికులకు బుధవారం కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా 2023–24 సంవత్సరానికి సంబంధించి వీటిని పంపిణీ చేశారు. త్వరలోనే యూనిఫాం చీరలు, టవాళ్లు వస్తాయని ఆయన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కార్మిక సమస్యలను గురించి ఈ సందర్భంగా అడిగారు. పెండింగ్ వేతనాలను సీఎఫ్ఎంఎస్‌లో పంపామని, త్వరలో చెల్లించడం జరుగుతుందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వారికి తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్

ప్రొద్దుటూరు రూరల్: వివిధ రకాల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుల నుంచి 18 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, ఇన్‌చార్జి ఆర్ఐ మహేంద్రారెడ్డి, వీఆర్ఓ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి చూపండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల: ప్రతి గ్రామంలో స్మశాన భూములను రికార్డుల్లో పొందుపర్చి, దారి చూపాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ సహాయ కార్యదర్శులు కేశవ, చెన్నయ్య, రెవెన్యూ అధికారులను కోరారు. బుధవారం సీపీఐ కార్యకర్తలతో కలసి తహసీల్దారు కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. పోరుమామిళ్ల మండలంలో ప్రతి గ్రామంలో స్మశాన స్థలాలపై ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మండలంలోని నర్సింగ్‌పల్లె, గానుగపెంట, రామాయపల్లె, అక్కలరెడ్డిపల్లె, ఎస్టీకాలనీ, బూరగమానుపల్లె, కవలకుంట్ల, తదితర గ్రామాల్లో స్మశాన స్థలం రికార్డుల్లో లేకపోవడం వలన ఎవరైనా మృతి చెందినప్పుడు సమస్య ఎదురవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరయ్య, రవీంద్ర, శ్రీనివాసులు, బాషా, రంగాచారి, రాయప్ప, ఓబులేసు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : బెల్ట్ షాపులు పెట్టుకుంటామని కొందరు తమ వద్దకు వచ్చి అడుగుతున్నారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. బార్లు, వైన్ షాపులు ఉదయం 10 గంటల తర్వాతనే తెరవాలన్నారు. అయితే పట్టణంలోని కొందరు మద్యం వ్యాపారులు ఉదయం 6 గంటలకే షాపులు తెరుస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత అధికారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీఎస్ ముక్తియార్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పుచ్చ సాగుకు సమయమిదే

- ఆరుతడి పంటగా అనుకూలం
- తక్కువ నీటి వినియోగం
- మేలైన రకాలతో అధిక దిగుబడి



కలసపాడు: రబీలో ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసి లాభాలు పొందవచ్చంటున్నారు ఉద్యానశాఖ అధికారులు. ఈ పంట సాగుకు ఇదే అనువైన సమయమని, డిసెంబర్‌లో విత్తనాలు విత్తితే మార్చి వరకు పంట చేతికి వస్తుంది. పంటకు ఇసుక నేలలు అనుకూలమని, మేలైన రకాలను ఎంచుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. పుచ్చకాయ సాగుకు ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. 60 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడులు ఆశించవచ్చు. దీంతో రైతులు పుచ్చసాగుకు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది పోరుమామిళ్ల డివిజన్ పరిధిలో 300 ఎకరాల్లో పుచ్చను సాగు చేశారు. ఈసారి మరింత పెరిగే ఆస్కారం ఉంది.

విత్తుకునే విధానం

ఎకరానికి అర కిలో విత్తనాలు సరిపోతాయి. విత్తన శుద్ధి చేసి విత్తుకోవడం ఉత్తమం. అందుకోసం కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెబ్ పట్టించాలి. ముందుగా నేలను బాగా దున్ని చదును చేసుకోవాలి. సారవంతమైన నేలలో మూడు మీటర్ల ఎడం పాటించి విత్తుకోవాలి. తేలికపాటి సాధారణ భూముల్లో 25 మీటర్ల ఎడం, 60 సెంటీమీటర్లు వెడల్పు గల నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తనాలు నాటిన తర్వాత మొలిచేందుకు ఒక తడి నీరందించాలి. ఆ తర్వాత నేలస్వభావం, వాతావరణాన్ని బట్టి 5 నుంచి 7 రోజులకోసారి నీరు పెట్టాలి. పూత సమయంలో నీరందిస్తే ఉత్తమం. కాయలు ఎదిగే దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. కలుపు నివారణ కోసం లీటరు నీటికి 6 ఎంఎల్ పెండిమిథాలిన్ లేదా ఆలాక్లోర్ కలిగి కాలువ బోదెలకు విత్తనం విత్తిన రెండు రోజుల్లో పిచికారి చేయాలి.

ఎరువుల వినియోగం

ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. అదే విధంగా 250 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యురేట్ ఆఫ్ పోటాష్, 90 కిలోల యూరియాను వాడాలి. నత్రజని ఎరువును నాటేటప్పుడు రెండు పర్యాయాలు 25 రోజుల తర్వాత మరోసారి వేయాలి. పూత, పిందె సమయంలో 80 కిలోల కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్‌ను కలిపి మొదళ్ళకు ఇరువైపులా వేసి మట్టి కప్పాలి. తీగ పారే సమయంలో తల తుంచి సూక్ష్మధాతువులు మొక్కలకు అందేలా లీటరు నీటికి ఫార్ములా–4 లేదా ఆగ్రోమిక్స్ మాక్స్- గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

తెగుళ్ల నివారణ

మొజాయిక్ వెర్రి తెగులు సోకినప్పుడు ఆకులు ఆకారం కోల్పోయి ఆకుపచ్చ, పసుపు రంగు మచ్చలు వ్యాపించి బొబ్బలు ఏర్పడతాయి. తీగలు కురుచుగా మారి తక్కువ కాపు కుక్కమూతి పిందెలు వస్తాయి. వీటి నివారణకు పంట తొలి దశలోనే వైరస్ సోకిన ఏరి నాశనం చేయాలి. తెగులు వ్యాప్తికి దోహదపడే పేనుబంక పురుగు నివారణకు లీటరు నీటికి 15 గ్రాముల ఎసిఫేట్ కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలి.

మేలైన పుచ్చ రకాలు



అసాహియమాటా: ఈ రకం కాయలు 6 నుంచి 8 కిలోల బరువుతో పైన లేతాకు పచ్చరంగు, లోపల చిక్కటి గులాబిరంగు కండ కలిగి ఉంటాయి. 11 నుంచి 13 శాతం చక్కెరతో 95 రోజుల్లో పండు పక్వానికి వస్తాయి. 90 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

షుగర్‌బేబీ: ఇవి త్వరగా విత్తుకోవడానికి అనువైనవి. కాయలు చిన్నవిగా 2 నుంచి 3 కిలోల బరువుతో గుండ్రంగా ఉంటాయి. పైన నీలి వర్ణపు నలుపు, లోన చిక్కటి గులాబి రంగు కండ ఉంటుంది. 11 నుంచి 13 శాతం చక్కెరతో 80 నుంచి 85 రోజుల్లో పక్వానికి వస్తాయి. ఎకరానికి 60 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది.

అర్కజ్యోతి, అర్కమానిక్: ఈ రకం పండ్లు గుండ్రంగా ఉండి పైన ఆకుపచ్చ, ముదురాకుపచ్చ చారలతో ఉంటాయి. లోపల ఎరుపు కండ ఉంటుంది. 6 నుంచి 8 కిలోల బరువుతో ఎకరానికి 80 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. ఇది కాక ఎక్స్ఎస్–3955, అపూర్వ స్వీట్‌డ్రాఎక్స్, మాధురి, మధుబిందు, ఏటీటీ–3088 తదితర హైబ్రిడ్ రకాలు ఉన్నాయి.

లాభదాయకం



రైతులు ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసుకుని లాభాలు పొందవచ్చు. ఈ పంట సాగుకు నీటి అవసరం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంత వాతావరణానికి అనువైన రకాలను ఎంపిక చేసుకుని విత్తుకోవాలి. పూత, కాయ దశల్లో తగు జాగ్రత్తలు పాటించి కాయ ఊరేలా చూసుకోవాలి.

–శ్రీనివాసులరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, పోరుమామిళ్ల

శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీకి న్యాక్ గుర్తింపు



న్యాక్ గుర్తింపు పత్రాలను చూపుతున్న కరస్పాండెంట్ హరినారాయణ

ప్రొద్దుటూరు: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీకి న్యాక్ బీ ప్లస్‌ప్లస్ గుర్తింపు లభించిందని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కాలేజీలో విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు అన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. కంప్యూటర్ ల్యాబ్, ఈ–క్లాస్ రూమ్, ల్యాబ్స్, లైబ్రరీ, క్లాస్‌రూమ్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వీటన్నింటిని న్యాక్ బృందం పరిశీలించి ఈ గుర్తింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి, కళాశాల శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

పోరుమామిళ్ల: ఎస్టీయూ భవన్‌లో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ కన్వీనర్ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఉపాధ్యాయులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాశినాయన ఎంఈఓ నిర్మల మాట్లాడుతూ మానవులంతా సోదర భావంతో మెలగాలన్నారు. గౌరవించాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ అందరూ రాజ్యాంగ విలువలు గౌరవించాలన్నారు. ఎస్టీయూ జిల్లా మండల నాయకులు చంద్రహాసరెడ్డి, శేఖర్ బాబు, గురయ్య, బాలరాజు పాల్గొన్నారు.

దళారిని కఠినంగా శిక్షించండి



ఆందోళన చేస్తున్న సోమశిల ప్రాజెక్టు ముంపు బాధితులు

అట్లూరు : నిరుద్యోగులను మోసం చేసిన దళారి రామస్వామిని కఠినంగా శిక్షించాలని సోమశిల ప్రాజెక్టు ముంపు బాధితులు బుధవారం ఆందోళన నిర్వహించారు. బద్వేలు పట్టణం వెంకటయ్యనగర్‌లోని రామస్వామి ఇంటి ముందు బైఠాయించిన న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు ముంపు బాధితులు మాట్లాడుతూ రామస్వామి జిల్లాలోని బద్వేలు, గోపవరం, ఒంటిమిట్ట, మాధవరం, కొత్త మాధవరంతో పాటు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అనేక మంది ముంపు బాధితుల వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేశాడని తెలిపారు. అధికారులు స్పందించి రామస్వామిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు.

అన్నదానం

కాశినాయన: మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలోని వృద్ధులకు బుధవారం కలసపాడు మండలం శంఖవరం గ్రామానికి చెందిన పచ్చిపీళ్ల దేవరాజు 36వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు ఆనందరావు, కరుణాకర్ దంపతులు వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగిలేరు ఒడ్డున సేవాశ్రమంలో వృద్ధులకు తమ వంతు భోజనం పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు రామ తులసి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



సమీక్ష చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి

చాపాడు: సకాలంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ఇప్పటివరకూ మొదలుపెట్టని పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు పూర్తి చేయించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని గ్రామ సచివాలయం వద్ద బుధవారం పంచాయతీ రాజ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో ఎస్ఈ సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.2 కోట్లతో 45 చోట్ల సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వీటిలో 13 చోట్ల పనులు ఇప్పటి వరకూ పనులను మొదలుపెట్టలేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకూ సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించాలని, పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు పెట్టి పంపాలని మండల, నియోజకవర్గ స్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, పీఆర్ డీఈ మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి ఏఈ కేశవసాయి వర్మ, వెంకటసుబ్బారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లు పరిశీలించిన ఎస్ఈ: మండల కేంద్రమైన చాపాడులో ఇటీవల రూ.6.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను బుధవారం పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హరిజనవాడ, పీర్ల చావిడి వద్ద నిర్మించిన పనులను పరిశీలించి, రోడ్లు నాణ్యతగా ఉండేలా నీటిని రెండు వారాలు పైగా నీటితో తడపాలని అధికారులకు ఎస్ఈ సూచించారు.

దళితుల అభివృద్ధికి కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర మాలమహానాడు నాయకులు

ప్రొద్దుటూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర మాలమహానాడు (రామాజీ వర్గం) జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానియేల్ కోరారు. బుధవారం దళితులపై కొనసాగుతున్న కుల వివక్షత నిర్మూలన కోసం ప్రొద్దుటూరులో శివాలయం సర్కిల్ నుంచి మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇమ్మానుయేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న ఘోర అవమానాలు, మోసాలు, దాడులపై ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు, టెండర్లలో దళితులకు రిజర్వేషన్లను రద్దు చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్ కుమార్ మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా సుద్దపల్లి మురళీప్రసాద్, రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా సుద్దపల్లి అరుణ్‌కుమార్, ప్రొద్దుటూరు నియోజకవర్గం అధ్యక్షుడుగా నారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాయలసీమ మహిళ అధ్యక్షురాలు నీతు, రాయలసీమ సోషల్ మీడియా అధ్యక్షుడు సీకే కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



చాపాడు: సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ వీర కిషోర్



పోరుమామిళ్ల: సదస్సులో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాసులు

చాపాడు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల అభివృద్ధికి అధికార యంత్రాంగం కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న స్థానీకరణ, సుస్థిరాభివృద్ధిపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు వనరులను గుర్తించాలని, వీటి ద్వారా ప్రణాళిక బద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు చేరువ చేయాలి

పోరుమామిళ్ల: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలని బద్వేల్ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. స్థానిక సభాభవనంలో బుధవారం జరుగుతున్న సుస్థిర అభివృద్ధి సాధన రెండవరోజు శిక్షణ తరగతులను శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగు పరచి, ప్రతి కుటుంబం ఆర్థికంగా ముందుకు సాగేలా చూడాలన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపడాలన్నారు.

అపరాధ రుసుం చెల్లించి ఆవులను తీసుకెళ్లండి



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. మంగళవారం రాత్రి రోడ్లు ఆవులు తిరుగుతూ ట్రాఫిక్‌కు, వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కల్గిస్తుండటంతో వాటిని పట్టుకుని కొర్రపాడు రోడ్డులోని పాత రాజన్న క్యాంటిన్ వద్ద ఉంచామని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అపరాధ రుసుం చెల్లించి యజమానులు ఆవులను తీసుకెళ్లాలని తెలిపారు. యజమానులు ఆవులను బయటకు వదలి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకూడదని ఆదేశించారు. వైఎంఆర్ కాలనీలోని సాయి బాబా ఆలయం వీధిలో ఇంటింటి చెత్త సేకరణను కమిషనర్ పరిశీలించారు. అరవిందాశ్రమం వీధి, పెద్దమ్మతల్లి చెట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను కమిషనర్ గమనించి వాటి యజమానుల ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వార్డు కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలి



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్

అట్లూరు: బద్వేలు పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో గల కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా వర్తకులు వ్యాపారాలు కొనసాగించాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్‌లోని చిరువ్యాపారులు, రైతులకు ఖాళీ స్థలాన్ని మున్సిపల్ అధికారులు కేటాయించారు. బుధవారం మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎ.చంద్రమోహన్ మాట్లాడుతూ చాలా రోజులుగా కూరగాయల మార్కెట్ బయట రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేదని, మున్సిపల్, పోలీసు అధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు సతీష్, నరసయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, రెవెన్యూ, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో లాభాలు



ప్రొద్దుటూరు రూరల్ : తడిచిన వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి



ఖాజీపేట : పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

ప్రొద్దుటూరు రూరల్: ఆరుతడి పంటలు లాభదాయకమని, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కానపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు వరి పంటను సాగు చేశారని, రబీ సీజన్‌లో మళ్లీ వరిపంట సాగు చేయకుండా జొన్న, పెసర, పొద్దు తిరుగుడు, నువ్వు పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. పంట మార్పి వలన భూసారం పెరడంతోపాటు అధిక దిగుబడి పెరుగుతుందని తెలిపారు. వరి కోసిన రైతులు ధాన్యం వర్షంలో తడవకుండా భద్రపరుచుకోవాలన్నారు. అనంతరం గ్రామ పొలాల్లో వర్షానికి తడిచిన ధాన్యాన్ని అధికారుల బృందం పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఏఓ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వీణ, రైతులు పాల్గొన్నారు.

వరి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చాపాడు: వర్షానికి వరి ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచాలన్నారు. వర్షం తర్వాత వరి పైర్లకు తెగుళ్లు సంభవించే అవకాశం ఉందన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో దిగుబడి

ఖాజీపేట: పత్తి సాగులో శాస్త్రీయ విధానాలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ శంకర్ నాయక్ రైతులకు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా తవ్వారిపల్లె. సుంకేశుల గ్రామాల్లో పత్తి పంటను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జూన్ లేక జులై నెలల్లో పత్తి పంట సాగు చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎరువాక శాస్త్రవేత్త సరళ, ఖాజీపేట వ్యవసాయ శాఖ ఏఓ నాగార్జున, మండల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాహేబ్‌పేటలో 'పొలం పిలుస్తోంది'

అట్లూరు: అట్లూరు మండల పరిధిలోని తంబళ్లగొంది రైతుసేవా కేంద్రం పరిధిలోని బీబీ సాహేబ్‌పేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన క్రాసింగ్ మొక్కజొన్న పంటను బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

వర్ష సూచన.. రైతుల్లో ఆందోళన



పూత రాలిపోయిన తెల్ల శనగ పంట

రాజుపాళెం: ఫెంగల్ తుపాన్ నష్టాన్ని మరువక ముందే మరోసారి వర్ష సూచనతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మంగళవారం అర్ధరాత్రి మోస్తరు వర్షం పడటంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతింటాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నేలవాలిన వరిపంట, అలాగే కోతకు వచ్చిన మినుము, పెసర పంటలకు మరింత నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. అలాగే రహదారుల్లో, కల్లాల్లో ఆరబోసుకున్న వరి ధాన్యం తడిసి పోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంటలో పులుపు కారిపోవడం, పూత రాలిపోవడంతో ఈ ఏడాది పంట చేతికందదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలకు పరిహారం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



రాజుపాళెంలో నేలవాలిన వరిపంట

డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోండి

అట్లూరు: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు డిపో మేనేజర్ కన్యాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 కేజీల వరకు డోర్ డెలివరి సౌకర్యాన్ని ఆర్టీసీ కార్గో ద్వారా కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు కార్గో సేవలను ప్రజలకు అందుబాటులో తెచ్చామని పేర్కొన్నారు.